హల్‌చల్.. ఆపై గప్‌చుప్

మొదటిపేజీ తరువాయి...

చేయడం లేదు. నిజంగా బిగ్ బ్రదర్స్ నీడ లేకపోతే సర్కారు భూములను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన కంపెనీ గుట్టురట్ట యితే చర్యలుండవా? రెవెన్యూ రికార్డులనే మార్చిస్తానంటూ దర్జాగా ఒప్పందంలో రాసిన వ్యక్తిని అధికార యంత్రాంగం విచారణ చేయ కుండా వదిలివేస్తుందా?

ఉలిక్కిపడ్డ సూత్రధారులు

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలోని సర్వేనంబరు 92లో సుమారు 291.32 ఎకరాల ప్రభుత్వ భూమిని ల్యాండ్ పూలింగ్ చేసి ఓ కంపెనీ మాటున చెర పట్టేందుకు బిగ్ బ్రదర్స్ ప్రణాళిక రూపొందించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని 'నమస్తే తెలంగాణ' గురువారం వెలుగులోకి తెచ్చింది. సమాంతర వ్యవస్థగా ఏర్పడి భూములకు ఎన్‌వోసీ, పాస్ పుస్తకాలు తెస్తామంటూ అతుల్యం హోమ్స్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి పేరిట రైతులతో ఒప్పందాలు కూడా పూర్తయిన వైనాన్ని ఆధారాలతో సహా ప్రచురించింది. కొన్నిరోజుల కిందటే మాడ్గుల మండలంలోని వందల ఎకరాల కుందారం భూములను కొల్లగొట్టేందుకు జరిగిన ప్రయత్నాన్ని సైతం 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తేవడంతో అక్కడి రైతులంతా ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపులు, కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తమ భూములను ఇప్పుడు స్వేచ్ఛగా అనుభవిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాదర్‌గుల్ భూములను సైతం కొల్లగొట్టే యత్నాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. ఈ



కథనంతో సూత్రధారులు, పాత్రదారులు అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏకంగా 300 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని రైతుల నుంచి చవకగా పొందేందుకు కుట్ర రచించడం సామాన్యుడిని సైతం నివ్వెరపరిచింది. అధికార, రాజకీయవర్గాల్లో దీనిపై భారీ ఎత్తున చర్చ జరిగింది. మహేశ్వరం నియోజకవర్గంలోని గుర్‌గూడ, నాదర్‌గుల్ గ్రామాల్లో ఎవరి నోట విన్నా దీనిపైనే చర్చించుకోవడం కనిపించింది.

ఫిర్యాదుపై రెండు శాఖల బంతాట!

'నమస్తే' కథనం వచ్చిన గురువారం పోలీసులు, రెవెన్యూ అధికారులతో పాటు కాంగ్రెస్ నేతలు సైతం తీవ్రస్థాయిలో హడావుడి చేశారు. కానీ శుక్రవారం సీన్ ఒక్కసారిగా మారిపోయింది. రైతులతో ఒప్పందం చేసుకున్న అతుల్యం హోమ్స్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి ఎవరు? అంటూ ఆరా తీసి, చివరికి అతడిని కనీసం విచారించిన దాఖలాలు కూడా లేవు. ముఖ్యంగా ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేస్తున్నారనే కథనం వచ్చినందున తాను గురువారమే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాలాపూర్ తహసీల్దార్ ఇంద్రాదేవి తెలిపారు. మీర్‌పేట పోలీసులతో పాటు ఏసీపీ, డీసీపీకి ఫిర్యాదు కాపీలను ఇచ్చామని చెప్తున్న ఆమె.. ఆర్డీవో, కలెక్టర్‌కు కూడా ఈ వ్యవహారంపై లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చినట్టు చెప్పారు. కానీ పోలీసులు మాత్రం తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్తున్నారు. మీర్‌పేట సీఐతో పాటు ఏసీపీ, డీసీపీలను కూడా 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా తమకెలాంటి ఫిర్యాదు రాలేదంటున్నారు. దీంతో తెర వెనుక పావులు ఎంత వేగంగా కదిలాయో అర్థం చేసుకోవచ్చు.

అవును.. వాళ్ల పేర్లే వినిపిస్తున్నయ్!

రెండు రోజుల పాటు ఇదే అంశంపై విచారణ చేసిన అధికారులు శుక్రవారం సాయంత్రం గప్‌చుప్ అవడం గమనార్హం. అధికారికంగా బయటికి ఏం చెప్పకున్నా.. అంతర్గత సంభాషణల్లో మాత్రం ఈ భూముల వ్యవహారంలో బిగ్ బ్రదర్స్ పేర్లు వినిపిస్తున్నది నిజమేనని చెప్తున్నారు. కానీ విషయాలు వెల్లడించేందుకు మాత్రం జంకుతున్నారు. తమకు పైనుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉందని, అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానిస్తున్నారు. పైగా 'నమస్తే' కథనంపై విచారణ చేయాలంటూ గురువారమే భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. 'ఈ ఆర్టికల్ రాసి ప్రభుత్వాన్ని నిందల పాలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఆర్టికల్‌పై విచారణ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, డీజీపీని కోరుతున్నా. ఇప్పటికే ఎక్స్ ప్లాట్‌ఫాంలో కోరిన. రేపు లిఖితపూర్వకంగా అధికారులను కోరుతా. అవాకులు చెవాకులు పేలినది ('నమస్తే' కథనం) వాస్తవమైతే కచ్చితంగా అలా కొనుగోలు చేసే ప్రయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. లేదా ఇటువంటి తప్పుడు ప్రచారం చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా ఉంది' అని వీడియోను విడుదల చేశారు. కానీ చివరికి ఓవైపు తహసీల్దార్ ఫిర్యాదు చేశానని చెప్తున్నా.. పోలీసులు తమకు ఫిర్యాదు అందలేదని అంటున్నారంటే అధికార పార్టీ ఎంపీ డిమాండును కూడా అధికార యంత్రాంగం పరిగణనలోకి తీసుకోవడం లేదని అర్థమవుతున్నది.

అనధికారిక ఒప్పందంతో రైతులకే నష్టం: రెవెన్యూ నిపుణులు

'నమస్తే' కథనంతో సదరు కంపెనీ నుంచి రావాల్సిన డబ్బులు తమకు రాకుండా పోతున్నాయని ప్రధానంగా రైతులు ఆందోళన చెందుతున్నారని, కానీ ఇలాంటి అనధికారిక ఒప్పందాల వల్ల వారికే నష్టమని రెవెన్యూ నిపుణులు చెప్తున్నారు. లావణి పట్టా భూముల క్రయ, విక్రయాలు నిషేధమని, ఒక వేళ అలా చేసుకుంటే ప్రభుత్వం పీవోటీ కింద వాటిని తిరిగి స్వాధీనం చేసుకునే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. అందుకే రైతులు ఇలాంటి తాత్కాలిక ప్రయోజనాలకు లొంగిపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదమున్నదని అంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హెచ్‌ఎండీఏ తరపున ల్యాండ్ పూలింగ్‌కు కసరత్తు జరిగిందని, అట్ల ప్రభుత్వపరంగా జరిగితే రైతులకు అనధికారిక ఒప్పందాలతో వచ్చే ప్రయోజనం కంటే ఎక్కువ లాభం ఉంటుందన్నారు. ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు, ఎక్కువ విస్తీర్ణం ప్లాట్లు ఇస్తామని చెప్పినా అది నిబంధనలకు విరుద్ధమైనందున భవిష్యత్తులో అభివృద్ధి చేసిన ప్లాట్లపై కొర్రీలు పడతాయని సూచిస్తున్నారు. ప్రైవేట్ కంపెనీలు ఇప్పటికిప్పుడు ప్లాట్లు అమ్ముకొని చేతులు దులుపుకొని పోతాయని, ముమ్ముందు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తిరిగి ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుంటే రైతులకే నష్టమని ఒక రిటైర్డ్ రెవెన్యూ అధికారి వివరించారు. నాదర్‌గుల్ భూములకు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వపరంగా ల్యాండ్ పూలింగ్‌కు ప్రయత్నిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని హితవు పలికారు.

రైతులను రెచ్చగొట్టి..

ల్యాండ్ పూలింగ్ వ్యవహారం గుట్టు రట్టు కావడంతో సదరు కంపెనీ వ్యక్తులు వచ్చి రైతులను రెచ్చగొట్టినట్టు తెలిసింది. గురువారం ప్రవీణ్‌రెడ్డి కోసం పోలీసులు ఆరా తీస్తుండగానే అదేరోజు మధ్యాహ్నం 12.15 గంటల ప్రాంతంలో రెండు వాహనాల్లో ఆరుగురు వ్యక్తులు గుర్‌గూడకు వచ్చి పలువురు రైతులతో మాట్లాడినట్లు తెలిసింది. ఇందులో ఐదుగురు వ్యక్తులు వాహనాలు దిగి ఒక రైతు ఇంట్లోకి వెళ్లి మాట్లాడగా, మరో వ్యక్తి మాత్రం వాహనం దిగలేదని కొందరు తెలిపారు. వాహనం దిగని వ్యక్తి ప్రవీణ్‌రెడ్డి కావచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోకి వారు వచ్చి పోవడం పోలీసులకు తెల్వకుండా ఉంటుందా? అనే ప్రశ్న కూడా రేకెత్తుతున్నది. తమ ఒప్పందం ఎలా లీక్ అయిందంటూ సదరు కంపెనీ ప్రతినిధులు రైతులతో ఆరా తీసినట్టు తెలిసింది. మీడియా సమావేశాన్ని నిర్వహించి, సదరు కంపెనీకి ఎలాంటి సంబంధంలేదని చెప్పాలని, 'నమస్తే తెలంగాణ'కు వ్యతిరేకంగా కార్యక్రమం నిర్వహించాలని రైతులపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. దీంతో రైతులు శుక్రవారం మధ్యాహ్నం మీర్‌పేట చౌరస్తాలో 'నమస్తే తెలంగాణ' ప్రతులను దహనం చేశారు. అయితే తాము ఆ సార్ (అతుల్యం హోమ్స్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి) వద్దకు వెళ్లిన మాట వాస్తవమేనని, తమ భూములకు పట్టా పాస్ పుస్తకాలు లేకపోవడంతో ఆయనను ఆశ్రయించామని తెలిపారు. దానికి డబ్బులు అవుతాయని ఆయన చెబితే.. మేం ఇచ్చుకోలేమని చెప్పామని ఒక మహిళా రైతు తెలిపారు. పని కాదంటే తాము మళ్లొచ్చినట్టు చెప్పారు.

కార్పొరేషన్ మార్గదర్శకాలూ తుంగలోకి..

- 'మూసీ' బాధితులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలంటూ అధికారులపై ప్రభుత్వం ఒత్తిడి
- ఎలా మంజూరు చేయాలో తెలియక సతమతం
- 172 కుటుంబాల గుర్తింపు
- అందులో మైనార్టీలు 126, ఎస్సీలు 32, బీసీలు 12

హైదరాబాద్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): 'మూసీ పునర్జీవనం కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టబోం. పూర్తిగా ప్రైవేట్ సంస్థల నుంచే నిధులు సమీకరిస్తాం' అని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేషన్ల నిబంధనలను తుంగలో తొక్కుతున్నది. ఏక పక్షంగా ఆయా కార్పొరేషన్ల మార్గదర్శకాలకు విరుద్ధంగా రుణాలను మంజూరు చేసేందుకు సిద్ధమైంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలంటూ కార్పొరేషన్ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఎలా ఇవ్వాలంటూ కార్పొరేషన్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏం చేయాలో, ఎలా మంజూరు చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

మొత్తంగా 172 మందికి..

మూసీ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వం హైడ్రా పేరిట ఉప్పల్-2, ఎల్బీ నగర్-4, మలక్‌పేట-6 సర్కిళ్లతోపాటు దరియాభాగ్, జియాగూడ, నార్సింగ్ గ్రామాల్లో కలిపి దాదాపుగా 172 ఇండ్లను ఇప్పటివరకు తొలగించింది. వారిలో మైనార్టీలు 126 మంది, ఎస్సీలు 32, బీసీలు 12, ఎస్టీ, ఓసీ వర్గాల నుంచి ఒక్కొక్కరు ఉన్నట్టు గుర్తించింది. బాధితులకు ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇండ్లను కేటాయించింది. మూసీ బాధితులకు జీవనోపాధి కూడా కల్పిస్తామని ప్రకటించింది. అయితే, తాజాగా బాధితులకు ఆయా శాఖల పరిధిలోని కార్పొరేషన్లు, ఎస్‌హెచ్‌జీల ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని నిర్ణయించింది. జీవనోపాధి కోసం ఒక్కొక్క మహిళకు రూ.2 లక్షల వరకు అందజేయాలని నిర్ణయించగా, కార్పొరేషన్ల ద్వారా 70% అంటే రూ.1.40 లక్షలు, మిగిలిన రూ.60 వేలను ఎస్‌హెచ్‌జీ లింకేజీ రుణాలుగా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు నిర్దేశించింది. క్షేత్రస్థాయిలో సర్వే బాధితులు ఏ ఉపాధి మార్గాన్ని ఎంచుకుంటారు? తదితర అంశాలను సేకరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కార్పొరేషన్, సెర్ప్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు.

కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వం కార్పొరేషన్ల నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి రుణాలను ఇవ్వాలని ఆదేశాలు జారీ చేస్తున్నదని అధికారవర్గాలు అసహనం వ్యక్తంచేస్తున్నాయి. ఆయా కార్పొరేషన్లు రుణాల మంజూరులో పాటించే నిబంధనలు, ఎస్‌హెచ్‌జీలు అనుసరించే నిబంధనలు భిన్నంగా ఉంటాయని వివరిస్తున్నారు. ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉన్నవారికి వయసు, కాలపరిమితి వంటివాటితో నిమిత్తం లేకుండా సెర్ప్ రుణాలను మంజూరు చేస్తుంది. కానీ, కార్పొరేషన్లు మాత్రం 18-50 ఏండ్ల వయసు ఉన్నవారికి, అదీ ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేసి రుణాలు మంజూరు చేస్తాయి. ఒకసారి సబ్సిడీ రుణాలు పొందినవారికి ఆయా కార్పొరేషన్లు నిర్ణీత గడువు (సగటున ఐదేండ్లు) వరకు తిరిగి ఏవిధమైన రుణాలను మంజూరు చేయబోవు. ఇత రత్ర అనేక నిబంధనలు ఉన్నాయి. ప్రస్తుతం ఇదే ఇప్పుడు ఇబ్బందిగా మారిందని కార్పొరేషన్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం అందజేసిన 172 మంది జాబితాలోని పలువురు కార్పొరేషన్ రుణాలను పొందారని, అదేవిధంగా ఒకే కుటుంబానికి చెందినవారే ఇద్దరు ముగ్గురు ఉన్నారని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. నిబంధనలేవీ మార్చకుండా, అందుకు విరుద్ధంగా రుణాలను మంజూరుచేయాలని ప్రభుత్వం ఒత్తిడితేవడంపై కార్పొరేషన్ అధికారులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టబోమని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు కార్పొరేషన్ నిధులను ఎందుకు వినియోగిస్తున్నట్టు? అవి ప్రభుత్వ నిధులు కావా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వందల ఫోన్లు.. అనేక విధాలుగా ఆరా!

'నమస్తే' కథనంతో ఉక్కిరిబిక్కిరైన సూత్రధారులు గురువారం ఉదయం నుంచే ఆరా తీయడం మొదలుపెట్టారు. చివరకు పోలీసు శాఖ.. రెవెన్యూ శాఖ సైతం ఉదయం ఆరు గంటల నుంచే రంగంలోకి దిగింది. నగరంలోని పలువురు 'నమస్తే తెలంగాణ' రిపోర్టర్లకు ఫోన్లు చేసి అసలు ప్రవీణ్‌రెడ్డి ఎవరు? అతుల్యం హోమ్స్ ఎవరిది? అంటూ పదుల సంఖ్యలో ఫోన్ కాల్స్ చేసి ఆరా తీశారు. ఇంటెలిజెన్స్ విభాగం సైతం ఆదిబట్ల, మీర్‌పేట పోలీసులతో వాకబు చేయించింది. పోలీసులు గుర్‌గూడ గ్రామంలోకి వెళ్లి రైతులు, పలువురు ప్రజాప్రతినిధులను విచారించారు. డీసీపీ స్థాయి అధికారులు రంగంలోకి దిగి పలువురు కార్పొరేటర్లకు ఫోన్లు చేసి ఏం జరుగుతున్నదంటూ కూపీ లాగారు. అప్రమత్తమైన రెవెన్యూ శాఖ వెంటనే రంగంలోకి దిగి భూముల వద్ద ఏమైనా కదలికలు ఉన్నాయా? అని విచారణ నిర్వహించింది. మరోవైపు కాంగ్రెస్ నేతలు కూడా కథనంపై ఆరా తీశారు. అధిష్ఠానం నుంచి ఫోన్లు వస్తున్నాయంటూ పలువురు నేతలు క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో తెలుసుకొని సమాచారాన్ని పైకి చేరవేశారు.

బాలికపై గ్యాంగ్‌రేప్

- నిందితులుగా ముగ్గురు మేజర్లు, ఇద్దరు మైనర్లు
- వికారాబాద్ జిల్లాలో ఘటన.. ఐదుగురిపై పోక్సో కేసు

దోమ,నవంబర్ 1: వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం దోమ పోలీసు స్టేషన్ పరిధిలోని గుండాల గ్రామంలో ఓ బాలికపై ఐదుగురు లైంగికదాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండాల గ్రామానికి చెందిన ఓ బాలిక గ్రామంలోని పాఠశాలలో చదువుతున్నది. అదే గ్రామంలో చదువు మానేసిన యువకులు ఆ అమ్మాయితో పరిచయం పెంచుకున్నారు. అక్టోబర్ 28న బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారు. విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో దోమ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐదుగురిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. నిందితులను న్యాయస్థానంలో ప్రవేశపట్టినట్టు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.

ఎస్టీ మహిళపై కాంగ్రెస్ నేత లైంగికదాడి

నల్లగొండలో అవమానంతో బాధితురాలి ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ, నవంబర్ 1: ఎస్టీ మహిళపై కాంగ్రెస్ నాయకుడు లైంగికదాడికి పాల్పడగా, అవమానభారంతో బాధితురాలు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన ఎస్టీ మహిళ గత నెల 21న రాత్రి ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గంటా కృష్ణయ్య ఆమె ఇంట్లోకి ప్రవేశించాడు. మహిళను చంపుతానని బెదిరించి, లైంగికదాడి చేశాడు. బాధితురాలి కేకలతో స్థానికులు రావడంతో కృష్ణయ్య పరారయ్యాడు. అవమానం తట్టుకోలేక బాధితురాలు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువుల ఆమెను సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై బాధిత కుటుంబం ఈ నెల 22న కాంగ్రెస్ నాయకుడు గంటా కృష్ణయ్యపై వేములపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకోకపోవడంపై సీఐ వీరబాబును నమస్తే తెలంగాణ వివరణ కోరగా, పూర్తిస్థాయి విచారణ జరిపిన అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిందితుడు కాంగ్రెస్ నాయకుడు గంటా కృష్ణయ్య

బాలికపై లైంగికదాడికి యత్నం

ధరూర్, నవంబర్ 1 : జోగుళాంబ గద్వాల జిల్లా బిజ్వారంలో రాజేశ్వరి ఘటన మరువకముందే మరో అరాచకం వెలుగులోకి వచ్చింది. ధరూర్ మండలంలోని ఓ గ్రామంలో ఓ బాలికపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు రాగా యువకుడు పరారయ్యాడు. ఈ సంఘటన వారం కిందట జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. యువకుడిపై కేసు నమోదు కాకుండా అతడి బంధువు, ఓ ప్రజా సంఘ నేత అనుచరుడు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. స్థానిక ఎమ్మెల్యే స్వగ్రామంలో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాలుష్యంలో న్యూఢిల్లీ టాప్

న్యూఢిల్లీ, నవంబర్ 1: దేశ రాజధాని న్యూఢిల్లీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. దీపావళి వేడుకల అనంతరం ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) 388 పాయింట్లతో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్టు స్విస్ సంస్థ ఐక్యూ ఎయిర్ శుక్రవారం వెల్లడించింది. అయితే ఇంత జరిగినా కాలుష్యం అనుకున్నంత తీవ్రంగా ఏమీ దిగజారలేదంటూ ఢిల్లీ మంత్రి తన ఆనందాన్ని వ్యక్తం చేయడం విశేషం. దీపావళి సందర్భంగా టపాసుల వినియోగంపై పలు ఆంక్షలు విధించినప్పటికీ ప్రజలు పెద్దగా పట్టించుకోకుండా విచ్చలవిడిగా వాటిని కాల్చారు.

హైడ్రాతో స్థానిక సంస్థలకు చెక్!

- రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా అధికారాల అప్పగింత
- కీలక శాఖల అధికారాలన్నీ హైడ్రాకే బదలాయింపు
- లోకల్ బాడీస్‌లోని పలు శాఖలు నిర్వీర్యమయ్యే ప్రమాదం
- జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ ఉద్యోగుల్లో అసంతృప్తి

నల్ల చెరువు వద్ద ఇండ్లను కూల్చివేస్తున్న బుల్డోజర్లు (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): 'హైడ్రా వస్తే మున్సిపల్ కార్పొరేషన్ పోతుందా? పర్మిషన్లకు ఇక మున్సిపాలిటీతో పనిలేదా? రెవెన్యూ, హెచ్ ఎండీఏ పరిధిలోని చెరువులపై కూడా హైడ్రాకే అధికారాలా? నిర్మాణాల నుంచి కూల్చివేతల వరకు అన్నీ హైడ్రానే చూసుకుంటుందా? హైడ్రా వచ్చిన తర్వాత ఈ సంస్థలన్నీ ఏ పనిచేయాలి? వీళ్లందరినీ హైడ్రాలోనే మెర్జ్ చేసి ప్రభుత్వం తమ బరువు దించుకోబోతున్నదా?' ఇలాంటి చర్చలు జోరుగా సాగుతున్నాయి. హైడ్రాకు అధికారాలు కల్పిస్తూ ఆర్డినెన్స్ తెచ్చిన నేపథ్యంలో.. నిన్న మొన్నటివరకు ఒక 'ఏజెన్సీ'గా ఉన్న హైడ్రా, ఇప్పుడు ప్రభుత్వంతో సమాంతర వ్యవస్థగా పనిచేయబోతున్నది. ఆర్డినెన్స్‌లో హైడ్రాకు కల్పించినట్టుగా చెప్తున్న అధికారాలు మున్సిపల్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, వాటర్‌వర్క్స్, ఇరిగేషన్ శాఖలపై తీవ్ర ప్రభావం చూపున్నాయి. ముఖ్యంగా స్థానికసంస్థలైన కార్పొరేషన్, మున్సిపాలిటీలన్నీ నామమాత్రంగా మారతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. మున్సిపల్‌చట్టం, జీహెచ్‌ఎంసీ చట్టాల్లోని ప్రధాన అంశాలను హైడ్రాకు బదిలీ చేస్తూ వాటిలో ఉన్న పలు విభాగాలను నిర్వీర్యం చేసేలా ఈ ఆర్డినెన్స్ ఉన్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

పలు శాఖలు నిర్వీర్యం!

ప్రస్తుతం హైడ్రాకు ఇచ్చిన అధికారాలతో ముఖ్య శాఖలన్నీ నిర్వీర్యమవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రస్తుత చట్టాల ప్రకారం హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతంలోని ఆక్రమణలు తొలగించాలంటే జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా శాఖలకు సంబంధించిన పలు చట్టాల పరిధిలో పనిచేయాల్సి వస్తున్నది. తాజా ఆర్డినెన్స్‌తో సదరు శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవచ్చు లేదా అవసరాన్ని బట్టి వారి అధికారాలను కూడా హైడ్రాకు బదిలీచేసే అవకాశం ఉంటుంది. మున్సిపల్ చట్టంలో ఉన్న అధికారాల బదలాయింపుతో చుట్టుపక్కల మున్సిపాలిటీల అధికారాలన్నీ దాదాపుగా నామమాత్రంగా మారనున్నాయి. ఓఆర్ఆర్ పరిధి వరకు ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలను పరిరక్షిస్తూ సర్వాధికారాలు వచ్చేలా ఈ చట్టం రూపొందించారు. హైడ్రాకు జిల్లా కలెక్టర్, ఎమ్మార్వోలకు ఉన్న అధికారాలను బదలాయించారు. అన్ని ముఖ్య శాఖల నుంచి ముఖ్య చట్టాలను తీసుకొని వాటిని హైడ్రాకు బదలాయిస్తూ ఆయా శాఖలు నామమాత్రంగా వ్యవహరించేలా చేస్తున్నారు. చెరువులు, వాటి హద్దులను నిర్దేశించడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రస్తుతం నీటిపారుదల విభాగం చూస్తున్నది. ఇప్పుడు లేక్ ప్రొటెక్షన్ బాధ్యతను కూడా హైడ్రాకే అప్పగించారు. బీపాస్ చట్టం-2020 ప్రకారం.. జోనల్ కమిషనర్ నేతృత్వంలోని జోనల్ టాస్క్‌ఫోర్స్, కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు ఉన్న అధికారాలను ఇవ్వడంతో టాస్క్‌ఫోర్స్ పని కూడా హైడ్రా కంట్రోల్‌లోకే పోతుందని భావిస్తున్నారు. హెచ్‌ఎండీఏ చట్టం-2008లోని పలు సెక్షన్ల కింద కమిషనర్‌కు ఉన్న అధికారాలు, భూ ఆదాయ చట్టంలోని సెక్షన్-1317(ఎఫ్) ప్రకారం ఆక్రమణల తొలగింపు, ఆస్తుల పరిరక్షణకు ఆర్డీవో, కలెక్టర్‌కు ఉన్న అధికారాలు, అవే అంశాలకు సంబంధించి నీటిపారుదల చట్టంలోని జీవోఎంఎస్-67 ద్వారా 2002లో యూడీఏ అధికారికిచ్చిన అధికారాలు, భూ ఆక్రమణ యాక్ట్-1905లోని పలు సెక్షన్ల కింద జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో, డీటీకి ఉన్న అధికారాలు, వాల్టాయాక్ట్-2002, తెలంగాణ బిల్డింగ్‌రూల్స్, తెలంగాణ ఫైర్ సర్వీసెస్ చట్టంలోని పలు అధికారాలను హైడ్రాకు కట్టబెట్టారు. నీటిపారుదల శాఖలో ఉన్న పలు అంశాలు హైడ్రా పరిధిలోకి వస్తున్న నేపథ్యంలో ఆ శాఖ కూడా నామమాత్రంగా మారనున్నది. హెచ్‌ఎండీఏ చేపట్టాల్సిన పరిధిలో జరగాల్సిన పనులు కూడా ఇప్పుడు హైడ్రా చేస్తే హెచ్‌ఎండీఏ ఏంచేస్తుందనే ప్రశ్న తలెత్తుతున్నది.

ఉద్యోగుల్లో అసంతృప్తి!

హైడ్రాను కీలకమైన విభాగంగా చేస్తూ మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన ముఖ్య అధికారాలన్నింటినీ హైడ్రాకు కట్టబెట్టడం పట్ల ఆయా శాఖల అధికారులు, సిబ్బందిలో అసంతృప్తి మొదలైంది. హైడ్రాకు కల్పించిన అధికారాలపై అటు వివిధ ప్రభుత్వ శాఖల్లోనూ, ఇటు ప్రజల్లోనూ చర్చ జరుగుతున్నది. చట్టాల్లో ఉన్న లొసుగులు, వాటిపై పూర్తి స్టడీ చేయకుండానే డైరెక్ట్‌గా ఎటాక్ చేయడం పట్ల ఉద్యోగుల్లో ఇప్పటికే అంతర్గతంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇప్పుడు నేరుగా అన్ని అధికారాలను హైడ్రాకే కట్టబెట్టడంతో తమ పరిధి, పరిస్థితి ఏమిటి? తమ బాధ్యతలేమిటి? అనే ప్రశ్నలు ఉద్యోగుల్లో ఉత్పన్నమవుతున్నాయి. ఇన్నాళ్లూ మున్సిలిటీ ఇచ్చే 'నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్'తో పనులు జరిగిన చోట.. ఇప్పుడు హైడ్రా ఎన్‌వోసీ కావాలనే నిబంధన వస్తుందని పట్టణ విభాగ నిపుణులు చెప్తున్నారు. హైడ్రాకు ఇచ్చిన అధికారాలు గ్రేటర్ హైదరాబాద్‌లో టౌన్‌ప్లానింగ్ పనితీరుపై ప్రభావం చూపనున్నాయి. టౌన్‌ప్లానింగ్ పరంగా పర్మిషన్లు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుండగా.. ఇప్పుడు అందులో హై